క్లుప్తంగా

ఇంధనం పొదుపుగా వాడాలి

కాకినాడ రూరల్: మానవ జీవితంలో నిత్యావసరమైన ఇంధన వనరులను పొదుపుగా వినియోగిస్తే భావితరాలకు ఎంతో మేలు కలుగుతుందని ఆర్ట్ ఆఫ్ లివింగ్ ప్రతినిధి జి.కృష్ణమోహన్ పేర్కొన్నారు. సర్పవరం జంక్షన్‌లో జాతీయ ఇంధన వనరుల పొదుపు దినోత్సవాన్ని పురస్కరించుకుని జరిగిన అవగాహన కార్యక్రమాన్ని ఉద్దేశించి ఆయన మాట్లాడారు. సహజంగా లభించే ఇంధన వనరులను విచక్షణ రహితంగా వినియోగిస్తే తరిగిపోయి రాబోయే తరాలకు విపరీతమైన కొరత ఏర్పడే అవకాశం ఉందన్నారు. సంప్రదాయేతర ఇందన వనరులైన సౌరశక్తి, వాయుశక్తి, జీవవ్యర్థ పదార్థాల శక్తిని వినియోగించాలన్నారు. అడబాల రత్న ప్రసాద్, డాక్టర్ శిరీష తదితరులు పాల్గొన్నారు.

శీతాకాలంలో ఆరోగ్యం జాగ్రత్త



వృద్ధులకు దుప్పట్లు అందజేసిన డాక్టర్ వరలక్ష్మి

కాకినాడ రూరల్: శీతాకాలంలో వృద్ధులకు గొంతు సమస్యలు వచ్చే అవకాశం ఉందని ప్రాణిక్ హీలింగ్ వైద్యురాలు ఎం.వరలక్ష్మి పేర్కొన్నారు. ఈ కాలంలో తేమ శాతాన్ని అధిగమించడానికి వారు వేడి నీటిని తీసుకోవాలని సూచించారు. రమణయ్యపేట ఏపీఐఐసీ కాలనీ అడబాల ట్రస్ట్ కార్యాలయంలో ఆమె ఆర్థిక సహకారంతో వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేశారు. ఆర్మీ విశ్రాంతి ఉద్యోగి ఎస్.శ్రీనగేష్, అడబాల రత్న ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

సెల్ఫ్ సపోర్ట్ సీట్లకు దరఖాస్తుల ఆహ్వానం

ఎంఎస్ఎన్ క్యాంపస్ ప్రిన్సిపాల్ ప్రశాంతిశ్రీ



కాకినాడ రూరల్: ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం రాజమహేంద్రవరం ప్రధాన క్యాంపస్‌లో సెల్ఫ్ సపోర్ట్ సీట్ల కోసం యూనివర్సిటీ యాజమాన్యం ప్రకటన విడుదల చేసిందని ఏకేఏన్‌యూ ఎంఎస్ఎన్ క్యాంపస్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎస్.ప్రశాంతిశ్రీ పేర్కొన్నారు. ప్రస్తుతం ఈ క్యాంపస్‌లో ఎంఏ ఇంగ్లిష్, ఎంఏ పొలిటికల్ సైన్స్ అండ్ పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, ఎంఏ ఎకనామిక్స్, ఎమ్మెస్సీ మ్యాథమెటిక్స్, ఎం.కామ్ వంటి పీజీ కోర్సులు ఒక్కొక్క దానిలో 6 సెల్ఫ్ సపోర్టింగ్ సీట్లు అందుబాటులో ఉన్నాయని ఆమె పేర్కొన్నారు. క్యాంపస్‌లో ఆర్ట్స్ గ్రూపుల్లో పీజీ చేయాలి అనుకునే ఔత్సాహిక విద్యార్థులు ఈ అవకాశాన్ని ఉపయోగించుకుని 18వ తేదీన అవసరమైన సర్టిఫికెట్లతో అక్కడకు వెళ్లవలసిందిగా కోరారు. విద్యార్థులు సదవకాశాన్ని ఉపయోగించుకోవలసిందిగా పేర్కొన్నారు.

పేదలకు కళ్లజోళ్లు, దుస్తుల పంపిణీ



కళ్లజోళ్లు, దుస్తులు పంపిణీ చేస్తున్న దాతలు

బాలాజీచెరువు: లయన్స్‌క్లబ్ ద్వారా ప్రతి నెలా పేదలకు పంపిణీ చేస్తున్న కళ్లజోళ్లు, వస్త్రాల పంపిణీ బుధవారం లయన్స్ హాల్లో రెడ్ కాన్వెంట్ చారిట్రబుల్ ట్రస్ట్ ద్వారా అందజేశారు. ముఖ్య అతిథిగా చార్టెడ్ అకౌంటెంట్ టి.శ్రీనివాసరాజు హాజరై అందజేశారు. ఈ కార్యక్రమంలో బచ్చు కమలబాబు, ట్రస్ట్ కార్యదర్శి జగన్నాథం, కోశాధికారి కల్యాణి, దంగేటి సతీష్ పాల్గొన్నారు.

అనుమతి లేకుండా అంగన్‌వాడీ కేంద్రాలు తెరిచారు

కాకినాడ క్రైం: అంగన్వాడీ కేంద్రాల తాళాలు బద్దలు కొట్టారంటూ అంగన్వాడీ టీచర్లు, ఆయాలు నగరంలోని పలు సచివాలయాల సిబ్బందిపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. తాము నిరసనలో ఉండగా కనీస సమాచారం ఇవ్వకుండా కేంద్రాలలోకి ప్రవేశించారని ఫిర్యాదుల్లో పేర్కొన్నారు. నగరంలోని 128 కేంద్రాల్లోకి చొరబడ్డారని అన్నారు. ఈ సందర్భంగా 14ఏ వార్డు సచివాలయ వలంటీర్‌పై కూడా ఫిర్యాదు చేశారు. 100 మందికి పైగా అంగన్వాడీ టీచర్లు, ఆయాలు పలు పోలీసు స్టేషన్లలో ఈ ఫిర్యాదులు చేశారు.

ఆశా కార్యకర్తల ఆందోళన

కాకినాడ సిటీ: ఆశా కార్యకర్తల ధర్నాను కలెక్టరేట్ వద్ద సీఐటీయూ జిల్లా అధ్యక్షులు దువ్వా శేషుబాబ్జీ ప్రారంభించారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు చంద్రమళ్ల పద్మ, చెక్కలరాజీకుమార్ తదితరులు పాల్గొన్నారు.

భార్యాభర్తలకు గాయాలు

సామర్లకోట: స్థానిక కిర్లంపూడి రోడ్డులో ఈటీసీ లే అవుట్ జగనన్న కాలనీ సమీపంలో గురువారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో భార్యభర్తలు గాయపడ్డారు. పోలీసుల కథనం ప్రకారం పులిమేరుకు చెందిన దంపతులు సీత అప్పారావు, సత్యవతి మోటారు సైకిలుపై వస్తుండగా వెనుక నుంచి ఆటో ఢీ కొనడంతో ఇద్దరికీ గాయాలయ్యాయి. సత్యవతి తలకు బలమైన గాయం తగిలింది. క్షతగాత్రులను స్థానికులు స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

విద్యుత్ పొదుపు.. భవితకు వెలుగు..

- రోజురోజుకూ అధికమవుతున్న విద్యుత్ వినియోగం
- కాకినాడ అర్బన్, రూరల్‌లో 2.12 లక్షల కనెక్షన్లు
- అవగాహన లేమితో కొందరి అధిక వినియోగం
- ఫలితంగా బిల్లులపై ప్రభావం

కాకినాడ సిటీ: మారిన వాతావరణ పరిస్థితుల్లో విద్యుత్ లేకుండా పది నిమిషాలు కూడా ఉండలేని పరిస్థితి. అది ఇల్లు అయినా ప్రభుత్వ కార్యాలయమైనా, పరిశ్రమ అయినా ప్రతి పనీ విద్యుత్‌తో ముడిపడి ఉంటుంది. దీంతో విద్యుత్ వినియోగం నానాటికీ పెరిగిపోతోంది. ఫలితంగా బిల్లులు అధికంగా రావడమే కాక పర్యావరణంపై తీవ్ర ప్రభావం పడుతోంది. దీనిని కట్టడి చేసేందుకు వృథాను అరికట్టి విద్యుత్‌ను పొదుపుగా వినియోగించాల్సిన అవసరం ఉంది. ఈ మేరకు అవగాహన కల్పించేందుకు కేంద్ర ప్రభుత్వం గురువారం నుంచి జాతీయ ఇంధన పొదుపు వారోత్సవాలు నిర్వహిస్తోంది. కాకినాడ నగరం, రూరల్‌లో మొత్తం 2,12,820 లక్షల విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయి. వీటిలో గృహ వినియోదారులు అత్యధికంగా 1.86 లక్షల కనెక్షన్లు ఉండగా వాణిజ్య, వ్యాపారస్తులు 25,633, పరిశ్రమలకు 613 విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయి. రోజుకు దాదాపుగా 2.30 లక్షల మిలియన్ యూనిట్లు వినియోగం అవుతున్నాయి.

రూ.18 కొనుగోలు చేసి రాయితీపై సరఫరా

ప్రభుత్వం యూనిట్ విద్యుత్‌ను రూ.18 చొప్పున కొనుగోలు చేసి పేదలు, సామాన్యులకు రూ. 1.50పైసలు నుంచి రూ.5 వరకు వివిధ కేటగిరీ, శ్లాబ్‌ల మేరకు సరఫరా చేస్తోంది. మిగిలిన భారంతో పాటు వ్యవసాయ ఉచిత విద్యుత్ ఖర్చు కూడా ప్రభుత్వమే భరిస్తోంది.



జాతీయ పొదుపు వారోత్సవాలను ప్రారంభించి మాట్లాడుతున్న కలెక్టర్ కృతికా శుక్లా

వారం రోజుల పాటు ప్రత్యేక కార్యక్రమాలు

జాతీయ ఇంధన పొదుపు వారోత్సవాలు గురువారం నుంచి 20వ తేదీ వరకు వివిధ రూపాల్లో నిర్వహించేందుకు చర్యలు చేపట్టారు. సబ్‌స్టేషన్లు, విద్యా సంస్థల్లో కార్యక్రమాలు నిర్వహించి రైతులు, వినియోగదారులు, పారిశ్రామిక వేత్తలకు విద్యుత్ వినియోగంపై అవగాహన కల్పించనున్నారు.

పక్కాగా మీటర్ కౌంటింగ్

విద్యుత్‌శాఖ ప్రవేశపెట్టిన ఎలక్ట్రానిక్ డిజిటల్ మీటర్లు అతి చిన్న ఎల్‌ఈడీ లైటును వినియోగించినా లెక్కిస్తాయి. గతంలో ఉన్న మెకానికల్ మీటర్లను (చక్రం మీటర్లు) తొలగించి వాటిని ఏర్పాటు చేశారు. రిమోట్‌తో ఆఫ్ చేసినా టీవీ, చార్జర్లకు ఉన్న ఎల్‌ఈడీ లైట్ల విద్యుత్ వాడకాన్ని కూడా అవి పరిగణలోకి తీసుకుంటాయి.

బిల్లు ఆదాకు మార్గాలు

- ఇళ్లలో సాధారణంగా ఫిలమెంట్ (గుండ్రని ఎర్ర బల్బు) వాడరాదు. సీఎల్‌ఎఫ్ ఎల్‌ఈడీ బల్బులు వాడాలి.
- వాటి వాడకంతో విద్యుత్ ఆదా, ఎక్కువ వెలుతురు, ఎక్కువ కాలం మన్నిక వస్తాయి.
- మూడు వాట్ల ఎల్‌ఈడీ బల్బు వెలుతురు 45 వాట్ల ఫిలమెంట్ బల్బుతో సమానంగా వెలుతురు ఇస్తుంది. ఇవి వాతావరణంలో కార్బన్‌ను విడుదల చేయవు.
- టీవీ చూశాక రిమోట్‌తో కాకుండా స్విచ్ ఆఫ్ చేయాలి. లేని పక్షంలో ఎల్‌ఈడీ లైటు ఆన్‌లోనే ఉన్న కారణంగా డిజిటల్ మీటర్ యూనిట్లు కౌంట్ చేస్తూనే ఉంటుంది.
- ఐఎస్ఐ మార్కు ఉన్న గృహోపకరణాలు వాడాలి.
- కరెంటు స్టవ్, వాటర్ గీజర్లకు బదులు గ్యాస్ హీటర్లు కుక్కర్లు, బయోగ్యాస్ వినియోగించాలి.
- కంప్యూటర్లకు ఎర్తింగ్ ఏర్పాటు చేసుకోవాలి. షట్ డౌన్ చేశాక స్విచ్‌లు ఆఫ్ చేయాలి.

పొదుపే మంత్రం



విద్యుత్‌ను పొదుపుగా వాడకోవాలి. ఇళ్లలో సీఎల్‌ఎఫ్, ఎల్‌ఈడీ బల్బులు వాడితే 40 శాతం విద్యుత్ ఆదా అవుతుంది. అవసరం లేకుంటే స్విచ్ ఆఫ్ చేయాలి. గ్రామీణ ప్రాంతాలకు నిరంతరం విద్యుత్ సరఫరా ఇస్తున్నాం. అనవసరంగా వినియోగిస్తే బిల్లులు రెట్టింపు వస్తాయి. అలాగే రైతులు ఉచిత విద్యుత్‌ను ఇతర అవసరాలకు వినియోగించరాదు.

– ప్రసాద్, విద్యుత్‌శాఖ ఈఈ, కాకినాడ

- సహజంగా వచ్చే గాలి, వెలుతురును వినియోగించాలి.
- సెల్‌ఫోన్ చార్జింగ్ అయ్యాక స్విచ్ ఆఫ్ చేయకపోతే చార్జర్‌లో ఉన్న ఎల్‌ఈడీ లైట్‌కూ విద్యుత్ కాలుతుంది.
- మిక్సీ, కూలర్, వాషింగ్ మెషీన్, ఏసీ, షోకేజ్ ఐటమ్స్, ఇస్త్రీ పెట్టె, హోం థియేటర్, టీవీ, సౌండ్ సిస్టమ్స్, దోమల మెషీన్లు అవసరం లేకపోతే స్విచ్ ఆఫ్ చేయాలి.

రైతులు చేపట్టాల్సిన జాగ్రత్తలు

- రైతులు ఉచిత విద్యుత్‌ను ఇతర అవసరాలకు వాడరాదు.
- మోటార్లకు కెపాసిటర్లు ఏర్పాటు చేసుకోవాలి.
- ఐఎస్ఐ మార్కు మోటార్లు వినియోగిస్తే 20 శాతానికి పైగా విద్యుత్ ఆదా అవుతుంది.
- పైపు లైన్ల పంపులు బెండులు, వాల్వ్‌లు, జాయింట్లు ఎక్కువ లేకుండా చూడాలి.

దివ్యాంగులను ప్రోత్సహించాలి

- జెడ్పీటీసీ సుబ్బారావు, ఎంపీపీ శ్రీలక్ష్మి
- ఘనంగా దివ్యాంగుల దినోత్సవం



కరపలో విభిన్న ప్రతిభావంతులకు బహుమతులు అందజేస్తున్న ఎంపీపీ, జెడ్పీటీసీలు

కరప: దివ్యాంగుల పట్ల వివక్షత చూపకుండా వారిలో మనోధైర్యాన్ని నింపితే అన్ని రంగాల్లో రాణిస్తారని జెడ్పీటీసీ సభ్యుడు యాళ్ల సుబ్బారావు, ఎంపీపీ పెంకే శ్రీలక్ష్మి పేర్కొన్నారు. స్థానిక నక్కా సూర్యనారాయణమూర్తి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని భవిత కేంద్రంలో గురువారం దివ్యాంగుల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. చిన్నారులలో ఉండే ప్రతిభను గుర్తించి, తగిన విధంగా ప్రోత్సహిస్తే ఉజ్వల భవిష్యత్ ఉంటుందన్నారు. ఎంఈఓ–2 పి.సత్యనారాయణ మాట్లాడుతూ దివ్యాంగుల ప్రత్యేకావసరాలు గుర్తించి, ప్రభుత్వం వారికి అందిస్తున్న సేవలను వివరించారు. ఈ సందర్భంగా ఆటల పోటీలు నిర్వహించి, విజేతలకు ఎస్ఎంసీ మాజీ చైర్మన్ కె.వీర్రాజు సమకూర్చిన బహుమతులను అందజేశారు. తర్వాత దివ్యాంగులతో కేక్ కట్ చేయించి అందరికీ పంచారు. సర్పంచ్ సాదే ఆశాజ్యోతి, ఉప సర్పంచ్ భోగిరెడ్డి సూర్యనారాయణ, వైఎస్సార్ సీపీ నాయకులు పెంకే సత్తిబాబు, సాదే లోహిదాస్, మద్దూరి భాస్కర్, హెచ్ఎం యు.లీలామనోహర్, ఐఈఆర్‌పీ కె.స్వాతి, ఎస్.మల్లీశ్వరి, బి.మెర్సీరాయ్ తదితరులు పాల్గొన్నారు.

రాజకీయ లబ్ధి కోసమే వారి పొత్తు

- ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి
- 20వ డివిజన్‌లో వై ఏపీ నీడ్స్ జగన్



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి

కాకినాడ: రాజకీయ లబ్ధి కోసమే టీడీపీ, జనసేన పార్టీలు పొత్తుపెట్టుకుని తప్పుడు వాగ్దానాలతో ప్రజల ముందుకు వస్తున్నాయని, ఆ రెండు పార్టీలను నమ్మొద్దని ఎమ్మెల్యే ద్వారంపూడి సూచించారు. స్థానిక 20వ డివిజన్ మేకల కబేలా వద్ద గురువారం వై ఏపీ నీడ్స్ జగన్ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ సంక్షేమ పథకాల లబ్ధిదారుల ప్రదర్శన బోర్డును ఎమ్మెల్యే ఆవిష్కరించారు. ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ, కౌడ చైర్‌పర్సన్ రాగిరెడ్డి చంద్రకళాదీప్తి, వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షురాలు సుంకర శివప్రసన్న, ఏఎంసీ చైర్‌పర్సన్ పసుపులేటి వెంకటలక్ష్మి, డిప్యూటీ కమిషనర్ కోన శ్రీనివాస్ తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ద్వారంపూడి మాట్లాడుతూ తప్పుడు హామీలతో ప్రజలను దగా చేసేందుకు వస్తున్న చంద్రబాబు, కొండబాబు, పవన్‌కల్యాణ్‌లను నమ్మి మోసపోవద్దని సూచించారు. గతంలో ప్రజలకు అనేక హామీలు ఇచ్చి ఎన్నికల్లో గెలిచాక వాటిని పార్టీ వెబ్ సైట్ నుంచి కూడా తొలగించిన ఘన చరిత్ర టీడీపీదేనని విమర్శించారు. 20వ డివిజన్‌కు గడచిన నాలుగున్నరేళ్లలో దాదాపు రూ.37 కోట్ల విలువైన సంక్షేమ పథకాల లబ్ధిని ప్రజలకు అందించామన్నారు. ఇలాంటి సంక్షేమ ప్రభుత్వాన్ని ప్రజలు మళ్లీ ఆదరించాలని కోరారు. సమావేశంలో మాజీ కార్పొరేటర్లు వెలమల మల్లేశ్వరరావు, కొప్పనాతి నాగసత్యనారాయణ, స్థానిక నాయకులు చిక్కాల సుధ, నరసింహమూర్తి, పలువురు ఆర్‌ఎంపీ వైద్యులు పాల్గొన్నారు.

జగనన్న హయాంలోనే ప్రజా సంక్షేమం

కరప: అర్హత కలిగిన ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలు అందజేసిన ఘనత ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డికే దక్కుతుందని ఎంపీపీ పెంకే శ్రీలక్ష్మి, జెడ్పీటీసీ సభ్యుడు యాళ్ల సుబ్బారావు పేర్కొన్నారు. మండలం వేళంగి–2 గ్రామ సచివాలయం పరిధిలో గురువారం జరిగిన వై ఏపీ నీడ్స్ జగన్‌లో వారు మాట్లాడారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాలన రాష్ట్రానికి స్వర్ణయుగం లాంటిదన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాతనే పేదల జీవన ప్రమాణాలు మెరుగుపడ్డాయన్నారు. వచ్చే ఎన్నికల్లో ఎమ్మెల్యే కురసాల కన్నబాబును గెలిపించి తద్వారా జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రిని చేయాలన్నారు. నోడల్ అధికారి, ఈఓ పీఆర్డీ ఎస్‌వీ శ్రీనివాసరావు మాట్లాడుతూ గ్రామ సచివాలయం ద్వారా అమలు చేస్తున్న సేవలను, సంక్షేమ పథకాలను వివరించారు. వేళంగి–2 గ్రామ సచివాలయం పరిధిలో రూ.24.83 కోట్లను ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. అనంతరం సంక్షేమ పథకాల బోర్డును వారు ఆవిష్కరించారు. తర్వాత గ్రామ కూడలిలో వైఎస్సార్ సీపీ జెండాను ఆవిష్కరించారు. మండల వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు చింతా ఈశ్వరరావు, మండల సచివాలయాల కన్వీనర్ కాదా వెంకటేశ్వరరావు, ఏఎంసీ డైరెక్టర్ నున్న వెంకటేశ్వరరావు, గ్రామ కార్యదర్శి పి.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



వేళంగిలో సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరిస్తున్న అధికారులు, నాయకులు

ప్రయాణికుడి ట్యాబ్ అప్పగింత



ప్రయాణికుడికి ట్యాబ్‌ను అందజేస్తున్న జీఆర్పీ కానిస్టేబుల్ జయశాంతి

కాకినాడ క్రైం: సర్కార్ ఎక్స్‌ప్రెస్‌లో చెన్నై నుంచి కాకినాడకు వచ్చిన ఓ ప్రయాణికుడు మరచిపోయిన ఖరీదైన ట్యాబ్‌ను జీఆర్‌పీ సిబ్బంది వెదకి గుర్తించి సురక్షితంగా అప్పగించారు. వివరాలను కాకినాడ జీఆర్‌పీ సీఐ గౌస్ బేగ్ గురువారం సాయంత్రం ఒక ప్రకటనలో వెల్లడించారు. సర్యానద్ మజ్జి అనే వ్యక్తి బుధవారం చెన్నైలో సర్కార్ ఎక్స్‌ప్రెస్ ఎక్కి గురువారం కాకినాడలో దిగారు. ఇంటి వెళ్లిన తర్వాత తన బెర్తులో ట్యాబ్‌ను వదిలేసినట్లు గుర్తించి తక్షణమే జీఆర్‌పీ సీఐ గౌస్‌ను సంప్రదించారు. అతడి ఫిర్యాదుతో సీఐ ఆదేశాల మేరకు ఎస్ఐ రవికుమార్ ఆయన బృందం అతడు ప్రయాణించిన కోచ్ సహా మిగిలిన కోచ్‌లను జల్లెడ పట్టారు. గంటకు పైగా సుదీర్ఘ వెదుకులాట తర్వాత చివరికి ట్యాబ్‌ను గుర్తించి ప్రయాణికుడికి అందజేశారు. ఈ సందర్భంగా సర్యానద్ కాకినాడ జీఆర్‌పీ పోలీసుల సహకారానికి ధన్యవాదాలు తెలిపారు.

కేంద్ర పథకాల అమలుకే సంకల్పయాత్ర



కొంగోడులో వికసిత్ భారత సంకల్పయాత్ర ప్రతిజ్ఞ చేయిస్తున్న అధికారులు

కరప: ప్రధాని నరేంద్రమోదీ సారథ్యంలో కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రతి లబ్ధిదారునికి చేర్చడమే ధ్యేయంగా వికసిత భారత సంకల్ప యాత్ర సాగుతోందని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి పెదిరెడ్డి రవికిరణ్ తెలిపారు. మండలం కొంగోడులో గురువారం సర్పంచ్ నక్కా బాబులు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ కేంద్రప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమ పథకాలను ఆయన వివరించారు. ఉజ్వల గ్యాస్ పథకం లబ్దిదారులకు ఉచిత గ్యాస్ కనెక్షన్లు, ఆయుష్మాన్‌భవ కార్డులను అందజేశారు. అనంతరం సంకల్పయాత్ర ప్రతిజ్ఞ చేయించారు. దేశభక్తిని పెంపొందించేలా చిన్నారులు ప్రదర్శించిన నాటిక అందరినీ ఆకట్టుకుంది. మండల వ్యవసాయ సలహా మండలి అధ్యక్షుడు కోట వెంకటేశ్వరరావు, మండల బీజేపీ అధ్యక్షుడు రెడ్డి రమణేశ్వర్, కో ఆర్డినేటర్ పుట్టా వీరప్రసాద్‌గాంధీ, ఎంపీడీఓ కె.అప్పారావు తదితరులు పాల్గొన్నారు.


స్టీల్ ఇండస్ట్రీ ప్రారంభం

సామర్లకోట: స్టీల్ సామాగ్రి అనగానే సామర్లకోట పేరు గుర్తుకు వస్తుందని రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు అన్నారు. స్థానిక ఇండస్ట్రియల్ ఎస్టేట్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన స్టీల్ ఇండస్ట్రీని గురువారం ఆయన ప్రారంభించారు. ఇండస్ట్రియల్ ఎస్టేట్‌లో వివిధ రకాల చిన్న పరిశ్రమలు ఉన్నాయని ఆయన తెలిపారు. మున్సిపల్ వైస్ చైర్మన్ ఊబా జాన్‌మోజెస్, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి ఆవాల లక్ష్మీనారాయణ, కౌన్సిలర్ స్వయంభూరపు వీరభద్రరావు, లయన్స్ క్లబ్ జిల్లా చైర్మన్ చిత్తూలూరి వీర్రాజు, ఇండస్ట్రియల్ ఎస్టేట్ అసోసియేషన్ కార్యదర్శి గంజి బూరయ్య, సొసైటీ అధ్యక్షుడు మేకా శ్రీనివాసు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా షష్ఠి ఉత్సవాలు ప్రారంభం



చదలాడలో కొలువైన సుబ్రహ్మణ్యేశ్వర స్వామి



షష్ఠి ఉత్సవాల్లో భాగంగా విద్యుత్ కాంతులతో ధగధగా మెరుస్తున్న ఆలయం

- విద్యుత్ కాంతుల నడుమ చదలాడ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయం

పెద్దాపురం: జిల్లాలో బిక్కవోలు తరువాత మెట్ట ప్రాంతంలో ప్రసిద్ధి చెందిన మండలంలోని చదలాడ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి షష్ఠి ఉత్సవాలు గురువారం అట్టహాసంగా ఆరంభమయ్యాయి. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఆలయాన్నీ విద్యుద్దీపాలంకరణతో, చలువ పందిళ్లతో కళకళలాడాయి. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా స్వామి వారి దర్శన భాగ్యం కల్గించేలా ఆలయ కమిటీ అన్ని చర్యలు చేపట్టింది. షష్ఠి మహోత్సవాల్లో గురువారం సాయంత్రం భగవద్గీత ప్రచార సమితి వ్యవస్థాపకుడు మల్లికార్జున స్వామిచే లక్ష్మి శివ నామస్మరణం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు మాట్లాడుతూ 15వ తేదీ రాత్రికి రాజమహేంద్రవరానికి చెందిన శ్రీరామ బుర్రకథ బృందంచే బుర్రకథ ప్రదర్శన, 16న 'కోట బొమ్మాళి' ఇంద్రజాల ప్రదర్శన, 17న స్థానిక కళాకారులతో 'కోలాటం', 18న 'ఢీ' డ్యాన్స్ పోటీలు ఉంటాయని ఆలయ కమిటీ తెలిపింది. షష్ఠి రోజైన 18వ తేదీ వేకువ జాము నుంచి ఏలేరు నదీస్నానాలు ఆచరించి స్వామి దర్శన భాగ్యం, ఉత్సవ నిర్వహణ ఉంటుందని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఉదయం 11 గంటలకు దేవుని ఊరేగింపు, రాత్రి భారీ బాణసంచా పోటీలు ఉంటాయన్నారు. ఉత్సవాలకు ప్రతి ఒక్కరూ హాజరై భాగస్వాములు కావాలని కమిటీ విజ్ఞప్తి చేసింది.

అంగన్‌వాడీ కేంద్రాలను సమర్థంగా నిర్వహించండి





సచివాలయ అడ్మిన్లు, డివిజన్ల ప్రత్యేక అధికారులను ఉద్దేశించి మాట్లాడుతున్న కమిషనర్ నాగ నరసింహారావు

- కమిషనర్ నాగనరసింహారావు
- సచివాలయ సిబ్బందికి ఆదేశం

కాకినాడ: ప్రభుత్వ ఆదేశాల మేరకు అంగన్‌వాడీ కేంద్రాలను సమర్థవంతంగా నిర్వహించడంలో సచివాలయ కార్యదర్శులు ప్రత్యేక దృష్టిపెట్టాలని నగరపాలక సంస్థ కమిషనర్ సీహెచ్ నాగనరసింహారావు ఆదేశించారు. స్థానిక స్మార్ట్ సిటీ కార్యాలయంలో గురువారం సాయంత్రం సచివాలయ అడ్మిన్లు, ఆయా డివిజన్ల ప్రత్యేక అధికారులతో ఈ అంశంపై సమీక్ష సమావేశం ఏర్పాటు చేశారు. అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ నిరవధిక సమ్మె నేపథ్యంలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా సేవలకు అంతరాయం కలగకుండా చర్యలు తీసుకోవాలని కమిషనర్ సూచించారు. కాకినాడ పరిధిలోని 172 అంగన్‌వాడీ కేంద్రాల్లో బాలింతలు, గర్భిణులు, చిన్నారులకు ప్రభుత్వం అందిస్తున్న పౌష్టికాహారాన్ని సకాలంలో అందించేలా చర్యలు తీసుకోవాలన్నారు. సమ్మె వల్ల ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు ఎదురుకాకుండా సేవలు అందించాల్సిన బాధ్యత కార్యదర్శులపై ఉందన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణ బాధ్యతను ఆయా సచివాలయాల మహిళా ఉద్యోగులకు అప్పగిస్తున్నట్టు కమిషనర్ చెప్పారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో అందించాల్సిన సేవలపై శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో నగరపాలకసంస్థ కార్యదర్శి ఎం.ఏసుబాబు, సీడీపీవో దయామణి, మేనేజర్ కర్రి సత్యనారాయణ, ఏసీపీ నాగశాస్త్రులు, టీపీఆర్వో మానే కృష్ణమోహన్, పలువురు ప్రత్యేకాధికారులు, సచివాలయ అడ్మిన్లు పాల్గొన్నారు.

టీడీపీ నుంచి వైఎస్సార్ సీపీలో చేరిక



ఎమ్మెల్యే ద్వారంపూడి సమక్షంలో పార్టీలో చేరిన తాతాజీ తదితరులు

కాకినాడ: స్థానిక జగన్నాథపురం ప్రాంతానికి చెందిన కొప్పాడ తాతాజీ సుమారు 50 మందితో టీడీపీ నుంచి వైఎస్సార్ సీపీలో చేరారు. కాంగ్రెస్ పార్టీ యువజన విభాగంలో క్రియాశీలకంగా పనిచేసిన ఆయన ప్రస్తుతం టీడీపీలో కొనసాగుతున్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలకు ఆకర్షితులై పార్టీలో చేరుతున్నట్టు చెప్పారు. వీరికి ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు పంపన రామకృష్ణ, మీసాల దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పీఆర్ కళాశాలలో చరిత్రపై జాతీయ సదస్సు



సదస్సులో పాల్గొన్న వివిధ వర్సిటీల ప్రొఫెసర్లు

కాకినాడ సిటీ: స్థానిక పీఆర్ కళాశాలలో గురువారం జాతీయ చరిత్ర సదస్సును ప్రిన్సిపాల్ బీవీ తరుపాణ్యం ప్రారంభించారు. ఈ సదస్సులో గుంటూరు, విశాఖపట్నం, తిరుపతి, విజవాడలకు చెందిన చరిత్ర ప్రొఫెసర్లు పాల్గొని చరిత్ర ప్రాముఖ్యతను వివరించారు. ఈ కార్యక్రమంలో వివిధ యూనివర్సిటీలకు చెందిన ప్రొఫెసర్ డి.కిరణ్ చౌదరి, భాస్కరమూర్తి, ఈవీ పద్మజ, ఎం.శ్రీనివాసరెడ్డి, పి.లీలావతి తదితరులు చరిత్ర ప్రాముఖ్యతను వివరించారు. రామాయణ ఇతివృత్తాన్ని, బౌద్ధ కళలు, సామాజిక గమనం, వలస రాజ్యాల సమయం, దాని తరువాత అంశాలపైన, ఆర్ట్ అండ్ క్రాఫ్ట్ ఆఫ్ ఇండియా గురించి ప్రస్తావించారు. స్టూడెంట్స్ పోస్టర్ ప్రజంటేషన్ ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు బి.ఏలియా, ఆంజనేయులు, అకడమిక్, విజయకుమార్, ఎం.సోమరాజు తదితరులు పాల్గొన్నారు.

గ్యాస్ సిలిండర్లు, స్టౌల పంపిణీ



గ్యాస్ స్టౌలను పంపిణీ చేసిన సర్పంచ్ మహాలక్ష్మి, శ్రీనివాసరావు

కాకినాడ రూరల్: మండలంలోని గంగనాపల్లి గ్రామంలో సర్పంచ్ గీసాల మహాలక్ష్మి, జేసీఎస్ మండల కన్వీనర్ గీసాల శ్రీనివాసరావు ఆధ్వర్యంలో గ్రామస్తులకు ఉచితంగా గ్యాస్ స్టౌలు, సిలిండర్లను గురువారం పంపిణీ చేశారు. హెచ్‌పీ గ్యాస్ సహకారంతో పేదలకు 75 గ్యాస్ సిలిండర్లు, స్టౌలను పంపిణీ చేసినట్టు శ్రీనివాసరావు తెలిపారు.